# భయం - అభయం

ఈ నగరాల్లో దేన్నయినా సాధించవచ్చును గాని, గది సంపాదించడం అంత తేలికైన పనికాదు. నేను బ్యాంక్ ఉద్యోగిని, అవివాహితుడ్ని. కనుక కాస్త ఎక్కువయినా అద్దె కట్టగలను. కాని పై క్వాలిఫికేషన్లు ఉన్నంత మాత్రాన నాకు ఎవరూ గది అద్దెకివ్వలేదు.

రోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి పది గంటల మధ్య రూము వెతకడం పనిగా పెట్టుకున్నాను. పది గంటలకు బ్యాంకుకు వెళ్లడం, రాత్రిళ్లు రోజుకు వంద రూపాయలు అద్దెతో హోటలు గదిలో పడుకోవడం. అంత అద్దె ఇస్తున్న నాకు హోటలు గదిలో పరచిన ఫోమ్‌బెడ్ ముళ్లపరుపులా అనిపిస్తోంది. నిద్రపట్టడం లేదు. ఇలా ఎన్నాళ్లు అనేది నా సమస్య.

యథావిధిగా ఆ రోజు గదికోసం తిరుగుతున్న నాకు ఆ మేడమీది ఒంటరి గది ఊరించింది. గేటు తీసుకుని లోపలికి వెళ్ళాను. ఇంటి తలుపులు తెరిచే వున్నాయి. డోర్ కర్టెన్ వేసి వుంది.

"అయితే ఎవరైనా దారినబోయే ఒక పెద్ద మనిషిని అడుగుదాం. అతనేం చెబితే అదే ఆఖరు నిర్ణయం" అంటున్న ఆడగొంతు.

"యస్! దానికి ఇద్దరం కట్టుబడి వుండాలి. అక్కా ముందే చెబుతున్నాను" అంటున్న పరిపక్వంగాని మగగొంతు.

"ఓ.కె" మళ్లీ తియ్యని ఆడగొంతు.

"ఏమిటమ్మా! చిన్న పిల్లల్లా ఈ గొడవలు?" మృదువుగా మందలిస్తున్న మరో మగగొంతు. లోపల ఏదో గొడవ జరుగుతోంది. నాకెందుకు లెమ్మని నేను బయటకి నడిచి మర్యాద కోసం గేటు వేయడానికి ఇటు తిరిగే లోపుగా గేటు పడకుండా మధ్యనొచ్చి నిలబడ్డాడు బొద్దుగా వున్న ఓ పదహారేళ్ళ అబ్బాయి. ఆ అబ్బాయి పక్కనే చుక్కలాంటి అమ్మాయి నిలబడి వుంది.

"సార్! సార్! ఓ సారిలా వస్తారా" ఇద్దరూ ఏక కంఠంతో పిలిచారు.

నాకు జరగబోయే సత్కారం ముందే ఊహించినందువల్ల రెండు చేతులెత్తి వాళ్లకు నమస్కారం పెట్టి, "బుద్ధి తక్కువై గదికోసం వెతుకుతూ ఇలా వచ్చాను. నాకు గది వద్దు ఏమీ వద్దు. నన్ను మీ గొడవల్లోకి లాక్కండి" అంటూ ఇటు తిరిగాను.

"భయపడకండి సార్! సమస్య చాలా చిన్నది. మీరు మొహమాటం లేకుండా నిష్పక్షపాతంగా తీర్పు చెబితే మీకు గది ఖాయం" ఊరించింది అమ్మాయి.

"నిజం...." అని అబ్బాయి హామీ ఇచ్చాడు.

నేను గది దొరుకుతుందనే సరికి మహదానంద పడిపోయాను. ఏమైతే అదయిందని, వారి వెంట లోనికి నడిచాను. లోపల వీరి తల్లిదండ్రులు కాబోలు సోఫాలో కూర్చుని వున్నారు. నేను రెండు చేతులెత్తి వారికి నమస్కరించాను. కూర్చోమని వాళ్లు తమ కెదురుగా వున్న సోఫా చూపించారు. వెళ్ళి కూర్చున్నాను.

నేను నోరు తెరిచి ఏదో మాట్లాడబోయేలోగా సూటులో ఉన్న పెద్దమనిషి అదే ఆ పిల్లల తండ్రి అన్నాడు. " ఇంతకీ మా ఉమ. సతీష్ సమస్యను మీరు విన్నారా?"

"వినలేదండీ. ఇప్పుడేగదా లోపలికి రావడం" అన్నాను.

వెంటనే సతీష్, "బల్లి గురించి మీ అభిప్రాయం చెప్పండి" అన్నాడు ఆతృతగా.

"అదా మీ సమస్య" అనడిగాను తెల్లబోతూ ఉమ వైపు తిరిగి.

" ఆ... అదే.." అంది ఉమ ముఖం చిట్లించుకుంటూ.

నేను లాజికల్‌గా ఆలోచించాను. ఉమకు బల్లి మీద సదభిప్రాయం లేదని తెలిసిపోయింది... ఆమె ముఖం చూస్తుంటే. ఇద్దరి పిల్లల్లో పెద్దది ఆమె గనుక ఆమెకు ఫేవర్‌గా చెప్పి గది దక్కించుకుందామని నిర్ణయించుకున్నాను.

ఇంతలో నాకంటే లాజికల్‌గా ఆలోచించిన సతీష్ " ఏమండోయ్ మీరు ఏ సమాధానం చెప్పినా గది మీకు ఖాయం. నిష్పక్షపాతంగా చెప్పండి" అన్నాడు.

తర్వాత నేను గదికోసం వెతుకున్నట్లు, గది ఇవ్వడానికి వాళ్లు మాట్లాడుకున్న కండిషన్ తల్లిదండ్రులకు చెప్పాడు. వాళ్ళు కూడా నవ్వుతూ అందుకు అంగీకరించినట్లు తలలు ఊపారు.

"బల్లి పిల్లిలాంటి ఒళ్ళు జలదరించే ఓ వింత జంతువు. దాని శరీరమంతా విషం. ముఖం వికృతంగా వుంటుంది. బల్లి క్షుద్ర జంతువు. ఛ.... నిద్రలేచి బల్లి మొహం చూడకూడదు" అంటూ ఆపాను.

"వెరీ గుడ్, భలే చెప్పారు" ఆనందంగా చప్పట్లు కొట్టింది ఉమ నన్నభినందిస్తూ. సతీష్ ముఖం చిన్నబోయింది.

"స్టాప్" అంటూ అరిచాడు సతీష్. "మీరు పక్షపాతంతో బల్లిని గురించి చెడ్డగా చెబుతున్నారు. దానికి అది దేవుడు ఇచ్చిన రూపం. అది మనకెంత మంచి చేస్తుందో తెలుసా. ఇంట్లో మారుమూల ఉన్న పురుగుల్ని చంపి మనకెంతో మేలు చేస్తుంది. మనకు తెలియకుండానే మన ఇంటిని శుభ్రపరుస్తుంది. అంతెందుకు మనం కత్తితో చంపనూ

వచ్చు, పండు కోసి తిననూ వచ్చు. కరెంటు తాకితే ప్రమాదం కాని దైనందిన జీవితంలో దానివల్ల మనం పొందే సదుపాయాలు అపారం. హెడ్మాస్టరు అనాకారి అని విద్యార్థులు ఆయనకు నమస్కారం పెట్టకుండా వుంటారా. బల్లి విషయం కూడా అంతే. దాని ఆకారం వెనుకనున్న ఉపకారం గురించి కూడ మీరు ఆలోచించాలి. త్వరలో నేను రెండు బల్లులకు పెళ్లిచేసి వాటి ఋణం తీర్చుకోవాలనుకుంటున్నాను" ఆవేశంగా స్పీచిచ్చాడు సతీష్.

అప్పటికే ఆ మాటలు వినలేక కాబోలు ఉమ కళ్ళుమూసుకుని రెండు చేతులతో చెవులు మూసుకుని ఉంది.

"నా అభిప్రాయం నేను చెప్పానండి. మీ అబ్బాయి ఇంత బాధపడుతాడని నేననుకోలేదు. వస్తాను" సతీష్ తండ్రితో అని లేచాను. ఇప్పుడు కళ్ళు తెరిచి చేతులు ఒళ్లో పెట్టుకుంది ఉమ.

"నో..... నో... ఇందులో మీ తప్పేం లేదు. మీ అభిప్రాయం మీరు చెప్పారు, మీరు కూర్చోండి" అంటూ నన్ను బలవంతంగా కూర్చోబెట్టాడు ఆయన.

"మా పిల్లలకు తగాదా ఈనాటిది కాదు. చాలా కాలం నుంచి ఉన్నదే. బల్లంటే చిన్నతనం నుంచి మా అమ్మాయికి పరమ అసహ్యం. వాళ్లక్కను ఏడిపించడానికి సతీష్ దాన్ని తన ప్రాణమంటాడు. ఇరువై నాలుగు గంటలు దాని సుగుణాల్ని పొగుడుతూ ఉంటాడు. ఎలాగైతేనేం నీ తీర్పు చెప్పావు. ఇప్పుడు సతీష్ ఓడిపోయాడు. ఇక వాడు మాట్లాడకూడదు ఒప్పందం ప్రకారం. నువ్వు ఇక బల్లిమాట ఎత్తి మీ అక్కను ఏడిపించవుగా....."

"ఎస్! డాడీ ఇక నుంచి బల్లిని పొగడను" సతీష్ ప్రామిస్ చేసాడు.

"ఇంతకీ ప్రస్తుతం ఎక్కడ వుండడం" అంటూ మొదలు పెట్టి వివరాలు కనుక్కుని రూములో మర్నాడు దిగవచ్చునని చెప్పాడాయన.

ఎలాగైతేనేం, నా తీర్పు పుణ్యమాని నాకు వాళ్ల మేడమీద గది దొరికింది. సామానంతా గదిలోకి చేర్చి హాపీగా ఫీలయ్యాను.

రోజులు గడుస్తున్నాయి.. ఉమ. సతీష్‌ల సాహచర్యం, వాళ్ళ అమ్మా, నాన్నల అభిమానంతో రోజులు ఆనందంగా గడిచిపోతున్నాయి. కాకపోతే అక్కా తమ్ముడు కొట్లాటలు పెట్టుకోవడం, తీర్పుకోసం నా దగ్గరకు రావడం పరిపాటైంది. అందులో బల్లి ప్రస్తావన ఖచ్చితంగా వుంటుంది. అనాడు సతీష్ తను చేసిన ప్రామిస్‌ను ఏమాత్రం నిలబెట్టుకోలేదు. నా తీర్పు ఎప్పుడూ ఉమ వైపే ఉంటుంది. ఉమ రెండు వీధుల కవతల ఒక స్కూల్లో టీచర్‌గా పని చేస్తుంది.

ఒక రోజు సాయంత్రం రుసరుసలాడుతూ నా గదిలోకి అడుగుపెట్టింది ఉమ.

"ఇదేమిటి బాబోయ్ నేనేం చేసాను" అన్నాను భయంతో.

"మిమ్మల్ని కాదు సురేంద్ర గారూ. మా హెడ్‌మాస్టర్ ఒట్టి మూర్ఖుడు" అంది పళ్లు కొరుకుతూ.

అసలు జరిగిందేమిటి...

ఆ మధ్యాహ్నం మూడు గంటలకు సైన్సు క్లాసు వుందట ఉమకు. వేరెవరినైనా పంపమందట హెడ్మాస్టరుతో. కారణం ఆ రోజు బల్లిమీద పాఠం చెప్పాలట.

"అదేమిటమ్మా, అలా అంటావు. సైన్సు టీచర్‌వి నువ్వు, ఎప్పటికైనా ఆ పాఠం నువ్వే చెప్పాలి గదా..." అన్నాడట హెడ్‌మాస్టరు.

"సార్ సైన్సు సిలబస్ ఇరవై చాప్టర్లు. అందులో ఇదొకటి. ఎన్నో ఛాయిస్ ప్రశ్నలుంటాయి. ఈ ఒక్క పాఠం చెప్పకపోతే మాత్రం మునిగిపోయిందేమీ లేదు." అందట ఉమ.

"నీకిష్టం లేకపోతే ఉద్యోగం మానుకో, అంతేగాని సిలబస్ తగ్గించడానికి వీల్లేదు" అన్నాడట హెడ్మాస్టరు కోపంగా. దాంతో హెడ్మాస్టరును తిట్టుకుంటూ క్లాసుకు వెళ్లిందట ఉమ.

అప్పటికే పది నిమిషాలు ఆలస్యమైంది. ఆ క్లాసు కొంటె పిల్లలు ఊరుకోకుండా బోర్డుమీద చాక్‌పీస్‌తో ఓ పెద్ద బల్లిబొమ్మ వేసి దానికింద 'బల్లిని చూస్తే మా టీచరు పిల్లవుతుంది' అని రాసారట. ఒళ్ళుమండిపోయిన ఉమ ఎలాగోలాగ బల్లి పదం పలుకకుండా ఆ ముప్పావు గంట పాఠం చెప్పి బయటపడిందట.

అంతా చెప్పి, "మా హెడ్మాస్టరంటే మూర్ఖుడనుకుందాం, ఆ పిల్లలకేమైనట్లు. వాళ్లు కూడా నా బహీనతను కనిపెట్టి బల్లిబొమ్మ వేసి ఎగతాళి చేయాలా. స్టాఫ్‌రూములోను అంతే. మాటి మాటికి బల్లి ప్రస్తావన తెచ్చి మాట్లాడుతుంటారు. స్నేహితులకి, చుట్టాలకి ఇదే పని. రోజుకొకసారన్నా ఎవరో ఒకరి నోట్లోంచి బల్లి పదం వింటున్నానండీ. ఛ... అంతెందుకు? నాకు తెలియకుండానే నేను బల్లి పదాన్ని పదిసార్లు అంటున్నాను" అంటూ తెగ బాధపడిపోయింది ఉమ.

ఇలా రోజూ ఉమ నా గదికి ఏ వేళంటే ఆవేళప్పుడు రావడం, నాతో క్లోజ్‌గా మాట్లాడడం, నాగదికి వచ్చిన మిత్రులు చాలా మంది నా అదృష్టాన్ని పొగిడి, ఆమె అందాన్ని అభినందించి నాక్కాబోయే శ్రీమతిగా ఆమెను నిర్ణయించడం జరిగిపోయింది.

ఆ రోజు రాత్రి పొద్దుపోయి గదికి వచ్చాను. కారణం ఓ మిత్రుడి మ్యారేజ్ పార్టీకి వెళ్ళి, అటునుంచి సెకండ్‌షో సినిమాకు వెళ్ళి రాత్రి పన్నెండు గంటలకు గదికి వచ్చి అలాగే నిద్ర పోయాను. తెల్లవారి కాస్త  ఆలస్యంగా నిద్రలేచి స్నానం పూర్తి చేసి, టిఫిన్ చేద్దామని హోటల్‌కు వెళ్ళబోయే సమయంలో ఉమ నా గదిలోకి వచ్చింది.

“రాత్రి ఒక రిసెప్షనుకు వెళ్ళాను. మిత్రుల బలవంతం మీద అట్నుంచే ఓ ఇంగ్లీషు సినిమాకు వెళ్ళాను” అన్నాను.

“అరె ఇంగ్లీషు సినిమాకు వెళ్ళారా. వెరీ ఇంటరెస్టింగ్, నేను ఇంగ్లీషు సినిమాలంటే పడి చస్తాను. సినిమా పేరేమిటి? ఎలా వుంది” నా కెదురుగా కుర్చీ లాక్కుని కూర్చుని ఉత్సాహంగా అడిగింది.

“జురాసిక్ పార్క్. రాక్షస బల్లుల గురించి. చాలా బాగా తీసారు”

నామాట పూర్తి కాకముందే ఉమ కళ్లల్లో అగ్ని జ్వాలలు విరజిమ్మాయి. బుసలు కొట్టింది పిడికిళ్ళు బిగించింది.

“ఏం మీక్కూడా నేనంత చులకనయి పోయానా? మీరు కూడా నన్ను జోక్ చేస్తున్నారా?” ఆగ్రహావేశాలతో అంది.

“ఇందులో మిమ్మల్ని చులకన చేయాల్సినంత జోక్ ఏమీ లేదు. రాత్రి వెళ్ళింది ‘జురాసిక్ పార్క్’ అన్నది వాస్తవం. రాక్షస బల్లుల గురించి అన్నది అంతకంటే వాస్తవం. కావాలంటే చూడండి. ఇదే మీకు ప్రూఫ్' అంటూ జేబులోంచి టికెట్ ముక్కతీసి చూపించాను.

“ప్రూఫ్ కాదు నాకు కావాల్సింది, థీమ్ గురించి. అవంటే నాకు అసహ్యమని తెలిసి కూడా ఆ న్యాస్టీ క్రీచర్ పేరు నాముందు పదేపదే చెబుతారా” మండిపడింది ఉమ.

అప్పుడు నాకర్థమైంది, నామాటల్లో బల్లి అనే పదం ఆమెకు ఇంత కోపం తెప్పిచ్చిందని. ఆమెకు సారీ చెప్పాను. ఇంకే సినిమా దొరక్క స్నేహితుల బలవంతం మీద ఆ సినిమాకు వెళ్ళానని సంజాయిషీ ఇచ్చుకున్నాను. బల్లి అంటే నాకు అసహ్యమన్నాను. నా నిషిద్ధ వస్తువులైన బ్రాంది, విస్కీ, సిగరెట్, చుట్టలాంటి వస్తువుల పక్కన బల్లిని కూడా చేర్చాను. అప్పుడు శాంతించింది ఉమ.

ఒకరోజు మేడమీదకు వచ్చిన సతీష్‌ను అడిగాను. “ఎందుకోయ్ మీ అక్కకు బల్లంటే అంత అసహ్యం” అని.

"పూర్వ జన్మలో మా అక్క ఏదో పురుగై ఉంటుంది. సదరు బల్లి ఆ పురుగును తిని ఉంటుంది. అందుకే జన్మజన్మల బంధంతో మా అక్క ఈ రోజుకూ బల్లిని ద్వేషిస్తూ ఉంది" అన్నాడు వాడు.

ఇంతలో ఎక్కడనుంచి వచ్చిందో ఉమ, "రేయ్ మాట్లాడితే చంపుతాను" అంటూ సతీష్‌ని తరుముకుంది.

తరువాత నా దగ్గరకొచ్చిన ఉమతో "మీరు ఎంత మాత్రం పురుగై వుండరు. రంగు రంగుల సీతాకోక చిలుకై వుంటారు. మీతో స్నేహం చేయాలని చెప్పి బల్లి విఫలమై ఉంటుంది. అలా వెంటాడినందుకు ఈ జన్మలో మీరు బల్లిని ద్వేషిస్తూ వుండవచ్చు." అంటూ సున్నితంగా ఆమె కోపాన్ని పోగొట్టాను.

ఉమ సిగ్గుతో తల వంచుకుని చేతిగోళ్లు చూసుకుంటూ నెమ్మదిగా వెళ్ళిపోయింది.

ఆ రోజు ఆదివారం, ఉదయం పది గంటల వేళ నేను, ఉమ మాట్లాడు కుంటుండగా "ఇంతకీ నిన్నటి విషయం తేల్చావా లేదా" అని గద్దించాడు అర్ధాంతరంగా వచ్చిన సతీష్.

"ఇప్పుడు కొత్తగా తేల్చేదేముంది. స్కావెజ్‌నెగ్గరే గొప్ప హీరో. తర్వాతే సిల్వర్‌స్టర్ స్టాలోన్" అంది ఉమ.

"అయితే నీ అభిప్రాయం మార్చుకోవన్న మాట. ఒక్కసారి అను, 'సిల్వర్‌స్టర్ నెంబర్ ఒన్ హీరో' అని, వెళ్ళిపోతాను"

"అననంటే అననురా. నాదొకే మాట"

"అంతేనా. చివరిసారిగా అడుగుతున్నాను"

"అంతే" ఖండితంగా అంది ఉమ.

"సరే! చూపిస్తా నా తడాఖా" అంటూ వేగంగా వెళ్ళిపోయాడు సతీష్.

వీళ్లద్దరిలో ఎవరు గొప్పహీరో అనే విషయంలో చాలా సేపటి నుంచి ఘర్షణ పడుతున్నట్లు నాకు అర్థమయింది. న్యాయం చెప్పమని నన్నడగనందుకు నాకు చాలా సంతోషంగా వుంది.

'అయితే చూపిస్తా నా తడాఖా' అంటూ వెళ్ళిన సతీష్ ఉమని ఏం చేస్తాడోనని భయంగా వుంది.

నా అనుమానం ఆమె ముందు బయటపెట్టాను.

ఉమ నవ్వి, "భయపడకండి సురేంద్రగారూ. వాడిముఖం. నన్నేం చెయ్యగలడు. నాకంటే అయిదేళ్ళు వెనుక పుట్టినవాడు. బొద్దుగా ఉన్నాడుకున్నా రేమో! ఎడమచేత్తో ఒక కరాటే దెబ్బ కొట్టానంటే ఏడడుగుల అవతల పడతాడు" అంది.

ఇంతలో సతీష్ వచ్చి వాకిలి దగ్గర నిలబడ్డాడు పిడికిలి బిగించి.

"హు.. నేనన్నా, నా మాటన్నా నీకు లెక్క లేదుకదూ, అనుభవించు" అంటూ పిడికిట్లోని ఏదో వస్తువును ఆమెపైకి విసిరి పారిపోయాడు.

ఉమ అంత పెద్ద కేక వేస్తుందని నేను ఊహించలేదు. అర్థంగాక లేచి నిలబడ్డాను. గడగడ వణుకుతూ పరుగెత్తుకు వచ్చి నన్ను వాటేసుకుంది.

ఎదురుగా అరడుగు పొడవున్న బల్లి మా వైపు చూస్తు వుంది. సతీష్ తన పగ ఇలా తీర్చుకుంటాడని నేనూహించలేదు.

"ప్లీజ్ వదలండి! మీరు ఇంకా పెళ్ళికాని పిల్ల. నాలాంటి బ్రహ్మచారిని కౌగిలించుకుంటే మీకు ప్రమాదం. తర్వాత పెళ్ళి కావడం కష్టం" అన్నాను హెచ్చరిస్తున్నట్లు.

"హు. నాకు మీదగ్గరే రక్షణ సురేంద్రగారూ. నేను పెళ్లంటూ చేసుకుంటే మిమ్మల్నే చేసుకుంటాను" అంది కళ్ళు మూసుకుని నన్ను వదలకుండానే.

"ఏదో అవేశంలో అంటున్నావు. మీ నాన్న నీకేదో గొప్ప సంబంధం చూస్తున్నాడు"

"నేను మిమ్మల్నే చేసుకుంటానని మా నాన్నతో ఖచ్చితంగా చెప్పేస్తాను. మీరొక్కరే ఈ లోకంలో నాలాగా దాన్ని ద్వేషించేది. నన్ను అర్థం చేసుకున్నది మీరే. అందుకే మీరంటే నాకిష్టం." ఆ తియ్యని కౌగిలి ఇప్పుడల్లా విడిపోయేట్లు లేదు.

అందమైన సుందరాంగి కౌగిలి, నన్ను పెళ్లి చేసుకోవాలనే ఆమె నిర్ణయం. ఇవన్నీ ఊహించని విషయాలు. ఎంత అదృష్టవంతుడ్ని అనుకున్నాను. అయితే ఆ అదృష్టానికి కారణం ఎదురుగా కిందపడి కదలక మెదలక మా వంకే చూస్తున్న ప్లాస్టిక్ బల్లి. పెళ్లయిన తరువాత ఉమకు తెలియకుండా ఓ బంగారు బల్లిని చేయించి, ఆమెకు తెలియకుండా పూజామందిరంలో దేవుని విగ్రహం వెనుక వుంచి నిత్య పూజలు చేయాలని అప్పటికప్పుడే కఠోర నిర్ణయం తీసుకున్నాను.

ఈలోగా ఆమె నిర్ణయం మార్చాలి. లోకంలో మనకు ఇష్టంలేని మనుషులు, అసహ్యమైన జంతువులు, నచ్చని వస్తువులు ఎన్నో వుంటాయనేది ప్రకృతి సృష్టి అని, వాటిమీద అకారణమైన ద్వేషం, భయం పెంచుకుని మనసు పాడుచేసుకోకూడదని, మన పాటికి మనం మామూలుగా వ్యవహరిస్తూ వుంటే వాటి మానాన అవి పడి వుంటాయని నచ్చ

చెప్పాలి. అవసరమైతే సైక్రియాటిస్టు దగ్గరకు తీసుకు వెళ్ళి ఆమెకున్న బల్లి ఫోబియో పోగొట్టాలి అనుకున్నాను.

అంత గట్టి నిర్ణయం తీసుకోడానికి బలమైన కారణముంది. ఇంతకాలం బి.సురేంద్రగా మాత్రమే తెలుసు నేను ఉమకు. రేపు పెళ్లయిన తర్వాత నా పూర్తిపేరు బల్లి సురేంద్ర అని తెలుసుకుంటే నా గతి ఏమవుతుందోనని? ✹

**(ఆంధ్రభూమి దినపత్రిక, తేది 12-9-98)**